# ★ గాజుల పెట్టి ★

రచన: "రాజశ్రీ"

గాజుల గవరయ్య మళ్ళీ మలారాన్ని మూపుమీదికి ఎత్తుకున్నాడు. నలభై సంవత్సరాలనుండి గాజుల బేరం చేసి చేసి నడుము వంగిపోయింది. సన్నగా, ఎర్రగా వంగి నడిచేవాడు. మెలిపెట్టిన మీసం, పండిన గెడ్డం అతని ముఖానికి ఓ వింత అందంగా వుండేది. కష్ట సుఖాలన్నీ వంటబట్టి గాజులాటిదే మానవజీవితం అనే వేదాంతం నేర్చుకున్నాడు. గవరయ్య తండ్రి కుర్రాడికి నాలుగేళ్లు వచ్చేటప్పటికే అలసిపోయి కన్ను మూశాడు. అతని తల్లే పెంచి పెద్దచేసి వంశపారంపర్యంగా వచ్చే గాజుల మలారాన్ని అతనికిస్తూ 'బాబూ ఇదే మనకి ఆధారం, మీ తాతలు, తండ్రి దీన్నే లక్ష్మిలా చూసుకుని ఇంత సంపాదించి సుఖంగా రోజులు వెళ్లబుచ్చారు. చిన్నతనంలోనే నీకు కష్టాలు వచ్చాయి. మన రోజులు ఇల్లా వుండబట్టే ఆ మారాజు ఆయన దారి చూసుకున్నాడు. ఎట్లా చూసుకుంటావో వ్యాపారం" అన్నది.

పదమూడు సంవత్సరాల గవరయ్య పొట్టిలాగు, గళ్ళ చొక్కా తొడుక్కొని భుజంమీద మలారాన్ని వేసుకుని 'గాజులోయ్... గాజులూ... బలే రంగు రంగుల గాజులు' అంటూ కేకవేస్తూ, తిరిగేవాడు. గాజుల బేరంలో పెద్ద లబ్ధి లేకపోయినా సంసారం సాగటానికి సరిపోయేది. కాలం పరుగెట్టుతూనే వుంది.... వుంటుంది. మరో నాలుగు సంవత్సరాలు ముందుకు జరిగేటప్పటికి గవరయ్యలో మార్పు వచ్చింది. పొట్టిలాగు తొడిగే గవరయ్య బిళ్లకట్టు పంచ కట్టి పందలపాక మిల్లుల 80వ నెంబరు లాల్చీ తొడిగి, ఉప్పాడ జరీకండువా భుజంమీద సవరించుకొని మలారాన్ని మూపుమీద వయ్యారంగా పెట్టి బయలుదేరేవాడు. అతని నడకలో ఠీవి, ముఖంలో పురుషత్వపు చిహ్నాలు చక్కగా కన్పడ్డాయి.

గవరయ్య జీవితంలో పూర్తిగా యౌవనం ప్రవేశించింది. అతని మాటల్లో గాపుల్లో శృంగారం కదిలేది. తల్లి రోజూ పోరు పెట్టేది. "గవరయ్యా, నేనా పెద్దదాన్నయేను. ఇక బ్రతికినన్నాళ్ళు బ్రతకను. నువ్వూ - నీ పెళ్లాం సంసారం దిద్దుకుంటుంటే చూడాలని వుంది. మీ రంగయ్య మామ ఊరికే చంపేస్తున్నాడు. లక్ష్మమ్మ పెద్దదైందని, పెళ్ళిచేసెయ్యమనీ ఏమంటావ్?".... గవరయ్యకి లక్ష్మమ్మ మీద మనసు. జరీ చీర సింగారించుకొని,

ప్రచురణకు స్వీకరించిన
పోటీ కథానిక

కొట్టొచ్చేటట్టు పావలా కాసంత సిందూరపు బొట్టు నుదుట పెట్టుకొని, దిరిసినపూలు తల్లో కుక్కుకొని లేడిలా చెంగు చెంగున ఎగురుతూ తన దగ్గరకు వస్తూంటే అపళంగా రెండు చేతుల్ని నడుము చుట్టూ వేసి తన వళ్లోకి లాక్కోవాలని ఉండేది కాని అది అసాధ్యురాలు. వస్తున్నట్టే వుండి తను చేయి చాపేప్పటికి దూసుకుపోయేది. కలకత్తానుండి గాజులు తెప్పిస్తాడు తను. ఆవేవో కొత్తరకం గాజులున్నాయంటే కంపెనీకి రాశాడు. "సాగరిక గాజులు" అంటూ పంపించారు. అవి ధగ ధగ మెరుస్తూ ఇంధ్రధనుస్సులోని రంగులలో వున్నాయి. సాగరిక అనే అమ్మాయి వేసుకున్న గాజులట అవి.... పొట్లాలు విప్పి లక్ష్మమ్మని పిలిచి వాటిని గురించి చెప్పేడు.

"లచ్చీ - ఇవి సినిమాలో సాగరిక అనే అమ్మాయికి ఓ అబ్బాయి ప్రేమగా ఇస్తే ఆనందంతో తొడుక్కున్నదట. ఈ గాజుల గలగలల్లో కోటి వీణానాదాలున్నాయి ఇంద్రధనస్సులోని రంగులన్ని ఎట్లా కలసిపోయి వింత అందం కూర్చాయో చూశావా?" అన్నాడు. అతని మాటలకు ఆమె పులకరించి పోయింది.

"ఏం మావా?.... నాకు ఈ చేతికి ఐదు దీనికి ఐదు తొడుగు. చాలా బావున్నాయి" అంది, ఇంకేం మాట్లాడాలో తెలీక. ఆమె కళ్లల్లో లక్ష జ్యోతులు విరిశాయి. మావ మీద అనురాగం ఆమె ముఖంలో ప్రస్ఫుటంగా కన్పడింది. గవరయ్య జీవితంలో మొదటిసారిగా ఆనందం, తృప్తి పొందాడు. మూగవారై ఇద్దరూ కళ్లతో మాట్లాడుకున్నారు. ఆమె చేతికి గాజులు తొడుగుతుంటే అతనిలో ఓ దివ్యశక్తి ప్రవేశించింది. ఆమె వేళ్ళ అందం, మెత్తదనం, తను గాజులు తొడిగేటప్పుడు గుప్పిట పట్టుకున్నప్పుడు తనలో పులకరింతలతోపాటు అశాంతిని రేపింది. గాజులను తొడుగుతూనే తన వేళ్లతో ఆమె చేతిని తాకుతూ ఆమెకి గిలిగింతలు పెట్టాడు. తన శరీరం పట్టు తప్పుతోంది.... గాజులు తొడిగి ఆమె కళ్ళల్లోకి చూస్తూ వుండిపోయాడు. ఆమె కళ్ళల్లో మమతలు రేగి ఓ విచిత్రమైన కాంతి కన్పడింది.... ఆ కాంతి చూసేప్పటికి అణిగిన కోర్కెలు ఓసారి విజృంభించాయి. తనకి తెలియకుండానే శరీరం స్వాధీనం తప్పి, తన చేతులు ఆమె మెడని, ఉన్నత గోపురాల్లా వున్న ఆమె ఉరోజాల్ని తడిమాయి. ఎందుకో ఆమెకి తెలియదు ఓ హాయి కలిగింది అతణ్ణి అడ్డుపెట్టలేకపోయింది. పొగలు కక్కుతున్న అతని వేడి శ్వాస ఆమె బుగ్గలకు తగిలి కందిపోయాయి.... అంతలోనే ఆమెకి మత్తువదిలి ఒంటినిండా పమిట కప్పుకొని సిగ్గుగా "పో మావా ఎపుడూ ఇంతే" అంటూ లేడి పిల్లలా పరిగెత్తింది. గవరయ్య దిమ్మెరపోయాడు...

ఇవన్నీ అతని మనసులో ఓసారి మెరిశాయి. "లచ్చి"ని పెళ్ళిచేసుకొని

ఆమె సౌందర్యాన్ని, యౌవనాన్ని ఆరాధించి ఆనందించాలని అనుకున్నాడు. తల్లికి చెప్పేశాడు. మాఘ మాసంలోనే ఆ "మూడు ముళ్లు" వేసేరు పెద్దలు. రెండు సంవత్సరాలు రెండు నెలల్లా గడిపాడు. ఇదివరలో కంటె గవరయ్యలో రాజసం కన్పడింది. ముఖంలో కాంతి, ఆనందం ఎక్కువైయాయి. "రంభలాటి పెళ్లాం దొరికిందని గవరయ్య ఎక్కడా భూమిమీద నిలబట్టం లేదండీ" అనేవాడు తన స్నేహితుడు శంకరయ్య. మూడు పూవులూ ఆరు కాయలుగా గడిచింది ఆ కాలం. ముసలితల్లి ఆనందానికి అవధుల్లేవు. "లచ్చి"కి నెల తప్పింది. అత్త, గవరయ్యకూడ ఆమెని నేలమీద నడవనిచ్చేవారేకాదు. తిరగటం, పనిచేయటం తగ్గించారు. ఆమెలో మార్పుతోపాటు గాంభీర్యం వచ్చింది. ఏటి నీరు నిండుగా ప్రవహిస్తుంటే సామానులో బరువై నిండిన రహదారి పడవలా ఉంది ఆమె.

నెలలు నిండాయి. పురుటి గదిలో కోలాహలంగా వుంది. పురుడు రావటం ఆలస్యమైంది. నాటు మంత్రసాని దోహదంచేత ఆడపిల్ల బయటపడింది. కాని తల్లికి గడ్డుగా వుంది. బాలింత జబ్బు వచ్చింది. నాలుగోరోజు పిల్లకి నీళ్ళు పోసి తీసికొచ్చేంతలో తల్లి ప్రాణవాయువులు ఎగిరిపోయాయి. గొల్లుమన్నారంతా. గవరయ్యకి విచారం సాగరమై పొంగింది. తల బ్రద్దలు కొట్టుకున్నాడు. కాని పోయినజీవి తిరిగి ఎట్లా వస్తుంది? నలుగురూ ఓదార్చారు. "పుట్టిన జీవి ఎపుడో ఒకనాడు గిట్టాలి. ఆమెకి భూమిమీద నూకలు కరువైయాయి. ఆ పసి కందుని చూస్తూ ఆమెని మరిచిపో" తల్లి ఏడ్చింది. మొత్తుకున్నది. తన కొడుకు నూరేళ్ల బ్రతుకు బ్రద్దలైంది. తనింకేం చూసి సంతోషించాలి?.... పోయిన వాళ్ళతో మనం పోలేము. శ్మశాన వైరాగ్యంలా ఆ వేడిలో కొంతసేపు ఏడ్చి వూరుకుంటాం. మరునాటి నుంచి బండబారి జీవితంలో ప్రవేశిస్తాం.... కాలంతోపాటు క్రమంగా ఆ బాధలు మరచిపోతాము.

గవరయ్య ఆ బిడ్డకి ముద్దుగా 'బంగారం' అని పేరు పెట్టుకున్నాడు. ఆ పిల్ల ఆటపాటల్లో తన బాధని కొద్దిగా మరచేవాడు. పిల్ల పెద్దదైన కొద్దీ దానిలో తల్లి పోలికలే స్పష్టంగా కనబడేది. పాపని దగ్గరకు తీసికొని "నా బంగారు తల్లి - బాబాల కొండ" అని ముద్దుపెట్టుకుంటూ అలౌకికానందాన్ని పొందేవాడు. పెద్ద మార్పులేవీ లేకుండానే పది సంవత్సరాలు గడిచాయి. కాలం పరుగులో ఎన్నో జీవితాలు పరిగెత్తలేక వెనకనే పడిపోతాయి. మరికొన్ని రూపం లేకుండా నమసిపోతాయి. పెద్ద చెప్పుకో తగ్గదల్లా గవరయ్య తల్లి ఏళ్లపైబడటంతో మంచిన్ని ఏడింది.

"బంగారాని"కి వయసొచ్చింది. తల్లి కంటె మరో ఛాయ వుండేది. బంగార బొమ్మలా వుండేది. ఒక్కపిల్లే కదా పెళ్ళిచేసి అల్లుణ్ని కూతుర్ని తన దగ్గరే అట్టే వుంచుకుంటే బాధలేదు. తనూ వాళ్ల పంచనే ఉండి ఈ ముసలికాలం గడిపేద్దామనుకున్నాడు గవరయ్య. కాని విధి అనేది ఒకటి ఉందిగా!.... మనుషులు అనుకున్నవి జరగటానికి "విధి" అనేది కూడ సహకరించాలి. ఆ "విధే" కలిసి రాలేదు గవరయ్యకి. ఊళ్ళో "కలరా"లు ఉధృతంగా వున్నాయి. ఆ అమ్మకి ఈ ఇంటిమీద ఆగ్రహం వచ్చింది కాబోలు గుట్టుగా ప్రవేశించింది. "బంగారం" కి కలరా తగిలింది. ఇరవైనాలుగు ఘంటల్లో మసది కాకుండ పోయింది.

గవరయ్య అణగారిపోయాడు. ఏ ఒక్క ఆశపెట్టుకొని జీవితం గడుపుతున్నాడో అదీ అడియాశయి పోయింది. "సు ఖ ం" అనేది అనుభవించిందల్లా ఆరెండేళ్లే. తర్వాత కష్టాల పరంపరే. ముసలితల్లి ప్రాణాలు గట్టివి కనుక బ్రతికింది. అప్పటినుండి గవరయ్య దాదాపు పిచ్చివాడైయాడు. వీధిలో పిల్లల్ని చూసినా "నా తల్లీ బంగారం" అంటూ పిచ్చిగా అనేవాడు. ఆ యీడు పిల్లల్కి వట్టినే గాజులు తొడిగి వచ్చేవాడు. డబ్బులిచ్చినా పుచ్చుకొనేవాడు కాదు.

* * *

గాజుల గవరయ్య కేకవిన్న ఓ ఆవిడ పిలిచింది, పెద్దమండువాలోగిలి. లోగిల్లో కుర్చీమీద ఓ నలభై ఏళ్ల ముత్తయిదు కూర్చుంది. ప్రక్కనే ఓ పదహారు సంవత్సరాల యువతి నిలబడింది....

"ఏం తల్లీ పిలిచారా?.... కొత్త రకాల గాజులున్నాయి" అన్నాడు గవరయ్య.

"అమ్మాయికి వెయ్యి గవరయ్యా" అందామె.

గవరయ్య ఆ అమ్మాయికేసి చూశాడు. "అమ్మా బంగారం నువ్వా?" అన్నాడు అప్రయత్నంగా. తన కూతురు సజీవంగా ఎదురుగా నిలబడ్డట్లయింది. అదే ముఖం, నుదురు, నాజెంగా వున్న నాసిక గులాబీ రేకల్లాటి పలుచని మృదువైన పెదాలు, వెన్నెలలు వెదజల్లే దరహాసం.... ముసలి గవరయ్య కంట్లో నీళ్ళు నిలిచాయి. 'మరోచ్చె తల్లీ' అన్నాడు.

గాజులు ఏరి ఏరి తీశాడు. అరడజను గాజులు వేళ్లకి వేసుకొని ఎడమ చేత్తో ఆమె అరిచేతిని నొక్కి కుడిచేత్తో నెమ్మదిగా గాజులు తొడిగాడు. గాజులు వేసుకొని ఆ అమ్మాయికి ముచ్చటగా మలారానికి నమస్కరించి ముత్తయిదు దగ్గరకి చేరింది....

"మీరు వేసుకుంటారా అమ్మా" అడిగాడు గవరయ్య.

"ఇపుడక్కరలేదోయ్. మళ్ళీ కన్పడు" అంది.

మలారం సర్దుకుని కూర్చుండిపోయాడు అమ్మాయిని చూస్తూ. ఆవిడ డబ్బులిస్తే తీసికోకుండా "నా తల్లికి గాజులు తొడిగితే డబ్బు పుచ్చుకుంటానా?.... ఇంత దుర్మార్గాణ్ణా.... మీ అమ్మాయా?" అడిగాడు.

"ఇది నా కోడలు సుందరి" అందావిడ. కదలి వెళ్ళాలని లేదు. ఇంత కాలానికి మళ్ళీ కూతురుని చూసి నట్లయింది. తన కూతురులోని పోలికలున్నాయి అనుకున్నాడు.

రోజూ ఓసారి 'సుందరి'ని చూడక పోతే వుండలేకపోయేవాడు. ఏ కొత్త

(తరువాయి 20 వ పేజీలో)

## గాజుల సెట్టి

( 14వ పేజీ తరువాయి )

రకాలైన గాజులు వస్తే ముందు సుందరికి వేసి వచ్చేవాడు.

ఏమైన ఒకరోజు గవరయ్య ఆమెని చూడటానికి ఆలస్యంగా వెడితే మామ గారు, అత్తగారు సుందరిని అనేవారు.... "ఏం? ఇవాళ నీ కొడుకు రాలేదేం? చాల చిన్నకొడుకు".... ఆ మాటకి ఆ పిల్ల సిగ్గులో నవ్వుకునేది.

రోజులు గడిచాయ్..

ఓ రోజు గవరయ్య మందువా ఇంటికి వచ్చి కేకేశాడు. "అమ్మా సుందరమ్మా అంటూ. ఎంతకీ జవాబేలేదు. పక్కింటి వాళ్లని అడిగాడు. మా కేమీ తెలియదన్నారు వాళ్లు. ఆ రోజు అతనికేమీ తోచలేదు.... మర్నాడు- మూడో నాడు అలాగేఐంది. ఇకనేమైనా అడగాల్సిందేనని మర్నాడు ఇంట్లోకి వెళ్లాడు. అంతా ప్రశాంతంగా వుంది... పిలవగా పిలవగా పిలవగా ఓ పండు ముదసలి వచ్చాడు. "బాబుగారూ.... అమ్మాయి లేదాండి" అన్నాడు...."లేదు" అనేసి వెళ్ళిపోయాడు పిలిచినా పలకలేదు. గవరయ్యకి గుండెలో అదటు కల్గింది. ఇదేమిటి బాబూ ఎవరూ చెప్పరు? ఏమైంది నా తల్లి... రకరకాల గాజులు తెచ్చాను ఆమె చేతికి తొడగాలని అనుకున్నాడు. అలాగే నెల్లాళ్ళు తిరిగాడు. గాజుల అమ్మకం తగ్గింది. రోజూ రెండు సార్లు ఈ వీధికి రావలసిందే. మరి కొన్నాళ్లు గడిచాక మళ్ళీ వచ్చాడు ఈసారి ఎవరైనా వచ్చి మాట్లాడితేకాని వెళ్ళనని కూర్చున్నాడు. పిలిచాడు. సుందరి అత్తయ్య వచ్చింది....

'ఏం తల్లీ ఇన్నాళ్ళనుంచీ ఎక్కడ కెళ్లారు?... ఎవర్ని అడిగినా చెప్పేవారే కాదు.... నా బంగారం తల్లి ఏది?.... ఎన్నో రకాల గాజులు తెచ్చాను.... వీటికి ఖరీదు కట్టలేను తల్లీ" అన్నాడు.

ఆమె కళ్ళలో నీళ్లు నిలిచాయి. ప్రవాహాలై చారికలు కట్టాయి. గవరయ్య మతి భ్రష్టుడైయాడు. హృదయంలో రంపపుకోత మొదలైంది....

"ఏం తల్లీ అట్లా వున్నారు.... నా అమ్మ ఏది?.... ఈ ముసలాడిమీద దయతలచి ఓసారి చూపించండి.... ఈ గుక్కెడు ప్రాణాలు నిలవాలి ఆ తల్లిని చూసేదాక...."

ఆమె గిరుక్కున వెనక్కి తిరిగి "గాజులు అక్కర్లేదు వెళ్లు గవరయ్యా.... ఇక మాట్లాడలేను' అంది.. గవరయ్యకి ఇదేమీ అర్థం కాలేదు. ఏదో చెప్పలేని భయం ఆవహించింది. "నా తల్లిని చూపిస్తేకాని నేను కదలను" అని మొండికెత్తి కూర్చున్నాడు. సాయంత్రందాకా వెళ్లనేలేదు ...

సాయంత్రానికి కూడ గవరయ్య కదలక పోవటం చూసింది ఆమె.... అతని హృదయంలో సుందరి మీదనున్న ప్రేమకి, ఆపేక్షకి కదిలిపోయింది. సుందరిని చూస్తే గవరయ్య ఇక జీవిస్తాడా? అనుకున్నది... గవరయ్య ఆమెని చూస్తూ "ఒక్కసారి బంగారు తల్లిని చూపించు అమ్మా.... అంతకంటే ఇంకేమీ కోరను. నా చేతుల్తో ఈ గాజులు నా చిట్టి తల్లికి తొడిగి వెళ్ళిపోతాను" అన్నాడు.

కొద్దిసేపట్లో సుందరి అత్తగారితో వచ్చింది. ఆమెని దూరంనుండి చూసి కళ్ళు వత్తుకున్నాడు...

"ఇదిగో నీ బంగారు తల్లి" అంది.

సుందరి పాదాలు చూశాడు. పసుపు రాసి పారాణి పెట్టుకొనే పాదాలు వెల వెల పోయాయి. గవరయ్యకి ఇదేం బాగా లేదు.... నెమ్మదిగా కళ్ళెత్తాడు.... తెల్లటి వాయిల్ చీర గాలికి ఎగురుతోంది.... చేతులు వట్టివిగా ఉన్నాయి. రెండు జతల బంగారు గాజులు తప్పిస్తే మరేం కన్పడ లేదు. ఎప్పుడూ మోచేతిదాకా గాజులు వేయించుకొనే సుందరి ఇదేం చెప్మా ఇలా వుంది.... పాపనా! అనుకున్నాడు. ....ఇంకా కళ్లెత్తి చూశాడు. విశాలంగా ఉన్న నుదుటిమీద రక్త చందనంలాటి కుంకుమ ఏదీ?.... "ఇదేం తల్లీ బొట్టు పెట్టుకోవటం మర్చావా?" అంటుండగనే సుందరి కన్నీటి బొట్లు తన చేతిమీద రాలాయి....

"అమ్మా" అంటూ అరచి కూలి పోయాడు గవరయ్య.... సుందరి అత్త అతనికి స్పృహ వచ్చాక చెప్పింది.

"మా ఖర్మ కాలింది.... సుందరి సర్వ నాశనమైంది.

నా చిట్టి తండ్రి మమ్మల్ని దుఃఖసముద్రంలో ముంచి వెళ్ళిపోయాడు...." అనగానే "ఇంక నేను వినలేను తల్లీ.... ఈ పాపిష్టి జీవికి అన్ని కష్టాల దొంతర్లే బంగారు తల్లే" అంటూ కుప్పలా కూలి పోయాడు....

---


### భయపడకండి

పోలియో అను పిలువబడు స్నాయువాతం చూసి భయపడకండి.

ఆయుర్వేద పద్ధతులలో గ్యారంటీగా కుదర్చగలం.

ఇప్పటికే ఎన్నో కేసులు కుదిర్చాం.

వివరములకు:

శ్రీ లక్ష్మి నృసింహ
ఆయుర్వేద వైద్యశాల
మచిలీపట్నం.